అసౌకర్యాల వేదికలు

- తాగునీటి సదుపాయం కరువు
- రైతు వేదికల్లో రాజకీయసభలు, సమావేశాలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం


నస్రుల్లాబాద్ రైతు వేదిక


కుక్కలకు స్థావరంగా మారిన రైతు వేదిక

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వ్యవసాయంలో నూతన మెలకువలపై రైతులతో చర్చించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఓ రైతువేదిక నిర్మించింది. ప్రతి ఐదువేల ఎకరాలకు క్లస్టర్ ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. జిల్లాలో 104 రైతు వేదికలను నిర్మించగా ప్రతి దానికి రూ.22లక్షల చొప్పున మొత్తం రూ.2244.37లక్షలు ఖర్చు చేశారు. వీటిని పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్‌ల భాగస్వామ్యంతో నిర్మించారు. కామారెడ్డి డివిజన్‌లో 60, బాన్సువాడ డివిజన్‌లో 44 రైతు వేదికలను నిర్మించారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, మిర్జాపూర్, నస్రుల్లాబాద్ గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించారు.

రైతుల కోసం నిర్మించిన రైతువేదికల్లో అసౌకర్యాలు నెలకొన్నాయి. జిల్లాలో నిర్మించిన సగం రైతువేదికలకు నీటి సౌకర్యం లేదు. వేదికల వద్ద మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిర్మించినప్పటికి నీటి సౌకర్యం కల్పించలేదు. పలు క్లస్టర్లలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి కనెక్షన్‌లు ఇచ్చారు. ఇచ్చిన చోట నల్లాల ద్వారా వచ్చిన నీటిని నిలువ చేసుకోవడానికి ఎలాంటి హౌజ్‌లు నిర్మించకపోవడంతో నీరు వృథా అవుతుంది. రైతులకు కొత్త వంగడాలను, వ్యవసాయ మెలకువలను, పంటలకు తెగుళ్లసోకినా, భూసారపరీక్షలు తదితర వాటిని ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికలు ఏర్పాటు చేసినా ఆలక్ష్యం నెరవేరడం లేదనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

కొన్నిచోట్ల రైతు వేదికకు వేసినా తాళం కూడా తీయడం లేదు. దీంతో వీటిని రాజకీయ సమావేశాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. రైతు వేదిక పరిశుభ్రంగా ఉండేలా చూసే సిబ్బంది లేకపోవడంతో లోపల దుమ్ముతో నిండిపోతుంది.

గ్రామాలకు దూరంగా..

సభలకు సమావేశాలకు వస్తున్న అధికారులకు, రైతులకు తాగునీటి వసతి లేదు. మహిళా రైతులు, అధికారులు సమావేశాల సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. నల్లా కనెక్షన్లు ఇవ్వని వాటిలో చాలా వరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. కొన్నింటికి ఎలాంటి నీటి సౌకర్యం కల్పించలేదు.

నీటి సౌకర్యం కల్పించాలి



రైతు వేదికలకు రైతులు వెళ్లి మాట్లాడుకుందాం అంటే అక్కడ శుభ్రంగా ఉండదు. దీనికి తోడు నీటి సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సిబ్బంది ఉంటే శుభ్రంగా ఉంటుంది. నీటి సౌకర్యం కల్పించాలి.

– సాయిలు, రైతు, బొమ్మన్‌దేవ్‌పల్లి

నిధులు విడుదల కావడం లేదు



రైతు వేదికల నిర్వహణకు నిధుల విడుదల నిలిచిపోయాయి.రైతు వేదికల వద్ద తాగు నీటి వసతి కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది సైతం లేక పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– భవాని, ఏవో, నస్రుల్లాబాద్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: నియోజకవర్గంలోని బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందజేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణం,ఆయా మండలాల బాధితులకు రూ. 18లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులున్నారు.

పంచముఖి హనుమాన్ ఆలయ కమిటీ నియామకం

జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయ నూతన కమిటీని నియమించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో షబ్బీర్ అలీ నియామకపత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వైద్య కిషన్ రావు, డైరెక్టర్లుగా భీమ్‌రాజ్, దాసోజు శ్రీనివాస్, గంగమణి, శంకరయ్యలను నియమించారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులు షబ్బీర్ అలీని ఘనంగా సన్మానించారు.

దోమకొండ: రాజకీయ వ్యవహారాల కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను చేర్చడంపై మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారామ్ మధు, పార్టీ మండల నాయకులు ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేపడుతున్న నాయకులు

కామారెడ్డి టౌన్: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రూ. 600 కూలీ ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, పట్టణ కేంద్రాలలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో తెలంగాణకు నిధులు కేటాయించడంలో మొండి చేయి చూపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినట్టు రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు, కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు


నగదును అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్(జుక్కల్): బారెడు పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. చుట్టూ పక్కలా గ్రామాలతో పాటు కర్ణాటక, మహరాష్ట్ర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలి వచ్చారు. కుస్తీ పోటీలను తిలకించేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. కార్యక్రమంలో కుస్తీ పోటీల నిర్వాహకులు మైపాల్‌రెడ్డి, బ్రహ్మం, హైమద్‌ఉస్సెన్, సాయిలు, బ్యాతయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

వంగిన స్తంభాలకు మరమ్మతులు


సరంపల్లి ఎన్‌హెచ్ 44 పక్కన స్తంభాలను సరిచేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి ఎన్‌హెచ్ 44 పక్కన వంగిపోయిన కరెంట్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులు సరిచేశారు. వంగిన కరెంట్ స్తంభాలు శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. దీంతో సరంపల్లి ఎన్‌హెచ్ 44 వెంట ఏర్పాటు చేసిన స్తంభాలకు మరమ్మతులు చేశారు.దీంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వికసించిన బ్రహ్మ కమలం


బ్రహ్మ కమలాలను చూపుతున్న శంకర్

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని కాకతీయ నగర్‌కు చెందిన కవి,రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు సిరిగాద శంకర్ ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలం వికసించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపించే బ్రహ్మ కమలం మొక్కను శంకర్ నాటి సంరక్షిస్తున్నారు. బ్రహ్మ కమలం సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో వికసించాల్సి ఉండగా వాతావరణ పరిస్థితులు మారడంతో రెండు నెలలు ముందుగానే వికసించింది.

ఎరువుల కోసం ఆందోళన వద్దు


గర్గుల్‌లో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ అపర్ణ


పెద్దమల్లారెడ్డిలో.. చైర్మన్ రాజాగౌడ్

- పచ్చిరొట్ట ఎరువులు మరిన్ని తెప్పిస్తాం
- కామారెడ్డి ఏడీఏ అపర్ణ

కామారెడ్డి రూరల్ : భూసారం పెంచడానికి ఉపయోగపడే పచ్చిరొట్ట ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని కామారెడ్డి ఏడీఏ అపర్ణ సూచించారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్, చిన్న మల్లారెడ్డి గ్రామాల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీపై జీలుగ, పెద్ద జనుము విత్తనాలను రైతులకు ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి జీలుగ విత్తనాల బస్తాలు 808, పెద్ద జనుము విత్తనాల బస్తాలు 225 పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఇంకా 225 బస్తాల జీలుగ విత్తనాలు,, 50 బస్తాల పెద్ద జనుము విత్తనాల బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. ఇవి కూడా సరిపోకపోతే మరిన్ని బస్తాలు తెప్పిస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమను సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఏవో పవన్‌కుమార్, ఏఈవోలు ప్రతిమ, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

భిక్కనూరు/సదాశివనగర్ : మండలంలోని పెద్ద మల్లారెడ్డిలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో చైర్మన్ రాజాగౌడ్ రైతులకు సబ్సిడీపై జీలుగ, పెద్దజనుము విత్తనాలను పంపిణీ చేశారు. విండో సీఈవో మోహన్‌గౌడ్, నేతలు, మంద రాములు, బాబు, మెట్టుస్వామి, లింగం,నగేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రజాపతి మాట్లాడుతూ...50 శాతం సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): వానాకాలం సీజన్ కోసం జీలుగ(పచ్చిరొట్టి) విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని నల్లమడుగు, లింగంపేట సొసైటీల్లో 100 బస్తాల చొప్పున జీలుగ విత్తనాలు నిల్వ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో బస్తా 30 కిలోలు 50 శాతం సబ్సిడీతో రూ. 2137.50 పైసలు చెల్లించి జీలుగ బస్తాలు రైతులు కొనుగోలు చేయాలని సూచించారు.

జీలుగ విత్తనాల కోసం టోకెన్లు


బీబీపేటలో గుమిగూడిన రైతులు

బీబీపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. సొసైటీ పరిధిలో మొత్తం 366 బ్యాగుల జీలుగ విత్తనాలు, 125 బ్యాగులు పెద్ద జనుము విత్తనాలు వచ్చాయని ఏవో నరేందర్ తెలిపారు. జీలుగ విత్తనాల పంపిణీకి ఉదయం నుంచే రైతులు గుమిగూడారు. ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ టోకెన్లు ఇచ్చి బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు రాఘవేంద్ర, సంతోష్, రాజేశ్ సొసైటీ సీఈవో నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా చంద్రమౌళేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శుక్రవారం చంద్రమౌళేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠపనోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో గణపతి, శివుడు, నంది, నాగదేవత, పార్వతిమాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహం..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పూర్ణాహుతి, మహదాశీర్వచనము తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద పెద్దమ్మతల్లి, పెద్దిరాజు కల్యాణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీచైర్మన్ వెంకట్రాంరెడ్డి, మునిపల్ మాజీచైర్మన్ కుడుముల సత్యనారాయణ, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి చెనింగ రాజరాజేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

ఎల్లారెడ్డి: మండలంలోని వెల్లుట్లపేట గ్రామ శివారులో గల చెనింగ రాజరాజేశ్వరాలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రాజరాజేశ్వరాలయంలో ఈశ్వరుడు, నంది, గణపతి, పార్వతిమాత, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావాలని వారు కోరారు.

వైభవంగా బోనాల ఊరేగింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మకు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో పెద్దమ్మ ఆలయం చుట్టు ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, కులస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామంలో శుక్రవారం గ్రామ దేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లబండ్లను రంగులతో, మామిడి తోరణాలు, కొత్త చీరలతో అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. పిల్లలు ప్రదర్శించిన ఎడ్లబండి ఆకట్టుకుంది. అనంతరం నాయకమ్మ, అక్కమ్మ, ఆలయాల చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో దివ్యసమాధి వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజాగౌడ్, గంగారాం, బాపురావు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇల్చిపూర్ సరస్వతి ఆలయంలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలల సిద్దాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


తనిఖీచేస్తున్న ఏడీఏ అపర్ణ

భిక్కనూరు:నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని విత్తనాల షాపు యజమానులను కామారెడ్డి ఏడీఏ అపర్ణ హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని విత్తనాల షాపులలో విత్తనాలు, రికార్డులు తనిఖీ చేశారు. నాసిరకం విత్తనాలు విక్రయించవద్దని, రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్సై దత్తాద్రి గౌడ్, కామారెడ్డి మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, తదితరులున్నారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు మేలు


బహుమతులు అందజేస్తున్న అధికారి

లింగంపేట(ఎల్లారెడ్డి): సమ్మర్ క్యాంపుల నిర్వాహణతో విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని ఇన్‌చార్జి వహీద్‌సిద్దిఖీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డ్యాన్స్, కరాటే, డ్రాయింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించమన్నారు. 15 రోజుల పాటు విద్యార్థులు 150 మంది పాల్గొని విజయవంతం చేశారన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో షౌకత్‌అలీ, సమ్మర్ క్యాంపు నిర్వాహకులు యూసుఫ్, రాజులు, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలలో భాగంగా గ్రామ సభలు


దుర్కిలో మాట్లాడుతున్న అధికారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని జరిగిన సామాజిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం దుర్కి, మిర్జాపూర్, లింగంపల్లితండా, సంగం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకలను గ్రామ ప్రజల ముందు చదివి వినిపించారు. ఈవివరాలను వచ్చే నెల 3న జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యాకాంత్, ఎంపీవో రమణ, ఉపాధి హామీ సిబ్బంది లావణ్య, ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు సరిత, అనిల్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని


పాల్గొన్న అధికారులు

రాజంపేట : ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హని చేస్తాయని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్ అన్నారు. మండలంలోని ఆర్గొండ గ్రామంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గొండ పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం శేర్‌శంకర్ తండాలో ఆక్రమణలకు గురైౖ అటవీ భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లు నరకడం, కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో రామకృష్ణ, సీఐ సంపత్, ఎస్సై పుష్పరాజ్, ఎఫ్ఎస్‌వో బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


డోంగ్లీలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

మద్నూర్(జుక్కల్): నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా శిక్షకులు సూచించారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుష్ ఆరోగ్య మందిరంలో రోగులకు యోగాసనాలు వేయిస్తు నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు సుప్రియ, సందీప్ జాదవ్, ప్రసన్న ఉన్నారు.

సంక్షిప్తం

నేడు నిషేధిత పొగాకు ఉత్పత్తులపై అవగాహన

బిచ్కుంద(జుక్కల్): స్థానిక మున్సిపాలిటీ ఆవరణలో బిచ్కుంద న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను వాడొద్దని శనివారం ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు కోర్టు సెక్షన్ అధికారి సుదర్శన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వినిత్ కుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మూడు నెలల రేషన్ అందించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రేషన్ లబ్ధిదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని తహసీల్దార్ గంగాసాగర్ సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.కార్యక్రమంలో ఆర్ఐ సాహిత్య, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేపు నంబల్ల స్మృతి సదస్సు

కామారెడ్డి అర్బన్: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబల్ల కేశవరావు స్మృతి సదస్సును ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విప్లవ విద్యార్థి వేదిక మాజీ కన్వీనర్ విజయరామరాజు తెలిపారు. పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈస్మృతి సదస్సులో సాయుధ విప్లవ పోరాటం-శాంతి చర్చలు అనే అంశంపై ఆచార్య జి.హరగోపాల్ ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు.

రాయితీతో ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు నేడే ఆఖరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ల్యాండ్ రెగ్యూలరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి 25శాతం రాయితీ ఫీజు చెల్లించేందుకు శనివారం ఆఖరు తేదీ అని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వే నం.158/13లో 2011లో చేసిన వెంచర్‌లో సుమారు 100పైగా ప్లాట్లు ఉన్నాయన్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్లాట్ల యజమానులు వెళ్లగా అవి నిషేధిత జాబితాలోకి వెళ్లాయన్నారు. ఈ సమస్యను గుర్తించిన ఎల్1, ఎల్2స్థాయి అధికారులు ప్లాట్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించేశారన్నారు. శనివారం ప్లాట్ల యజమానులు ఎల్ఆర్‌యస్ ఫీజు చెల్లించుకోవాలని ఆయన సూచించారు.

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాల సేకరణ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు శుక్రవారం రైతు గుర్తింపు కార్డుకు సంబంధించిన వివరాలను సేకరించారు. రైతులకు గుర్తింపు కార్డు అందించడంలో భాగంగా రైతులకు సంబంధించిన పట్టాపాసు పుస్తకంలోని భూమి వివరాలు, ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్ వివరాలను సేకరించినట్లు ఏఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.